క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ ఆఫీస్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు

గుంటూరు రూరల్: వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ ఆదేశాల మేరకు ఏటుకూరులోని నియోజక వర్గ కార్యాలయంలో ఆఫీస్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు నియోజకవర్గ కార్యాలయం నుంచి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి పనిచేస్తుందని చెప్పారు. పార్టీ కార్యకర్తలపై, సోషల్ మీడియా కార్యకర్తలు, యాక్టివిస్టులపై పెడుతున్న అక్రమ కేసులను ధీటుగా ఎదుర్కొని, అన్ని విధాలుగా వారికి అందుబాటులో ఉండేందుకు కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశామని చెప్పారు. సెంటర్‌లో మెట్టు వెంకటప్పారెడ్డి (రాష్ట్ర ఉపాధ్యక్షులు, వైఎస్సార్ సీపీ సేవాదళ్) 9849792955, పాటిబండ్ల కవిత గుంటూరు జిల్లా మహిళా విభాగ ప్రధాన కార్యదర్శి 9390212373, కొమ్మారెడ్డి రామకృష్ణారెడ్డి (సీనియర్ అడ్వకేట్) 9848361788, ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటారన్నారు.

పిల్లలకు ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: స్థానిక తురకపాలెంరోడ్డులోని స్వర్ణాంధ్ర నగర్‌లో కేశవ స్మారక సమితి, గుంటూరు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు ఆళ్ల శ్రీకాంత్ రెడ్డి సేవలు అందించారు. చిన్న పిల్లల ఆరోగ్యం విషయంలో తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కేశవ స్మారక సమితి కార్యదర్శి చంద్రపాటి సుధాకర్ సమితి చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. సభ్యులు మునిపల్లె కృష్ణమోహన్, చెరుకూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీయార్ కథలు పుస్తకావిష్కరణ



నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురం శ్రీత్యాగరాజ స్వామి కళావేదికపై ఆదివారం అజో విభో కందాళం ఫౌండేషన్, సంస్కృతి సంగీత, నృత్య, సాహిత్య, నాటక సంస్థ సంయుక్తంగా ఆచార్య బేతవోలు రామబ్రహ్మం రచించిన బీయార్ కథల పుస్తకావిష్కరణ సభ ఆదివారం జరిగింది. సభకు అజో విభో కందళం ఫౌండేషన్ అధ్యక్షుడు ఆచార్య అప్పాజోష్యుల సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ సాహితీవేత్త రావెల సాంబశివరావు గ్రంథాన్ని ఆవిష్కరించగా, ప్రముఖ నాటక రచయిత వల్లూరి శివప్రసాద్ గ్రంథ పరిచయం చేశారు. సంస్కృతి నిర్వాహకులు సత్రాజు బాలచందర్ రచయిత పుస్తకాన్ని కృతియిచ్చారు. సినీ నటుడు వైఎస్ కృష్ణేశ్వరావు పాల్గొనగా, రచయిత, ప్రముఖ సాహితీవేత్త ఆచార్య బేతవోలు రామబ్రహ్మంను సత్కరించారు.

వృద్ధులు, దివ్యాంగులకు బియ్యం పంపిణీ



నగరంపాలెం: ఒంటరి జీవనం సాగించే వయోవృద్ధులు, దివ్యాంగులకు తమవంతుగా సహాయం అందించాలని శ్రీహనుమాన్ ఆదర్శ సేవా సమితి అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ అన్నారు. కొత్తపేటలోని సమితి కార్యాలయంలో ఆదివారం వయోవృద్ధులు, దివ్యాంగులకు బియ్యం, 11 రకాల నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల సహకారాలతో సమితి ఏర్పడిన దగ్గర్నుంచి ప్రతినెల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉచిత బియ్యం కమిటీ చైర్మన్ పోలేపల్లి వెంకటసుబ్రహ్మణ్యం, ఎస్‌వీ రమణ, టి.మురళీసాయి, పలకలూరి శివరావు, పోలేపల్లి లహరి, లక్ష్మీకుమారి, అనురాధ, స్నేహిత, వల్లంపాటి రజనీశ్వరరావు పాల్గొన్నారు.

పేద వైద్య విద్యార్థికి ఆర్థిక సాయం

గుంటూరు మెడికల్: నిరుపేద కుటుంబంలో పుట్టి డాక్టర్ కోర్సు చదివేందుకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ఓ వైద్య విద్యార్థికి గుంటూరుకు చెందిన వైద్యులు సాయం చేశారు. గుంటూరు నగరానికి చెందిన వైద్య విద్యార్థి ఆరేటి అనిల్ కుమార్, నీట్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి గన్నవరంలోని పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ కోర్సులో ప్రవేశాన్ని పొందాడు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న 'మా' స్కాన్ సెంటర్ అధినేత డాక్టర్ ఎం. ఆదినారాయణ, ప్రముఖ పిల్లల వైద్య వైద్యులు ఆలా వెంకటేశ్వర్లు, డాక్టర్ మహేష్, రిటైర్డ్ పోలీస్ అధికారి బాల వెంకటేశ్వరరావు, సామాజిక కార్యకర్త దాసరి తిరుపతిరావు ఆదివారం వైద్య విద్యార్థి చదువుకునేందుకు రూ.65 వేలు సహాయం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆదినారాయణ మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకి కాకూడదని దాతలు ఇటువంటి ప్రతిభావంతులను ఆదుకోవాలన్నారు. డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తల్లిదండ్రులు రోజువారి కూలీలైనప్పటికీ నీట్ పరీక్షలో అద్భుతమైన ప్రతిభ కనబరచి మెడికల్ సీటు సాధించిన అనిల్ కుమార్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఆర్థిక కష్టాల్లో ఉన్న తనను ఆదుకున్న దాతలకు అనిల్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

వైద్య శిబిరాలకు మంగళం

- ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు
- వైఎస్సార్ సీపీ హయాంలో స్పెషలిస్టు డాక్టర్లతో సేవలు
- ఉచితంగా పరీక్షలు, చికిత్సలు, మందులు పంపిణీ
- ప్రస్తుతం ఆ ఊసెత్తని ప్రభుత్వం



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం(ఫైల్)

పొన్నూరు: కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని పట్టించుకోక పోవడంతో 'పల్లె వైద్యం' పడకేసింది. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. గ్రామాల్లో ఉచిత వైద్యశిబిరాలు కనుమరుగయ్యాయి. చిన్నపాటి వైద్య సేవలకు పల్లె ప్రజలు క్రమేపీ దూరమవుతున్నారు. వ్యాధులొస్తే పట్టణాలకు పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రస్తుతం విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు

గ్రామాల్లో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. టైఫాయిడ్, మలేరియా, డెంగీ వంటి వ్యాధుల సోకి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తోంది. దీంతో గత ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో అమలుచేసిన మంచి కార్యక్రమాన్ని నిర్వీర్యం చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి కార్యక్రమాలు ఎప్పుడూ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గత ప్రభుత్వంలో వైద్యానికి పెద్దపీట

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు విశేష కృషి చేసింది. ఇందుకు ఎన్నో కార్యక్రమాలు చేపట్టింది. ఏదైనా ఆపరేషన్ అవసరమైతే ఆరోగ్యశ్రీ ద్వారా చేయించుకునేందుకు వీలుగా సిఫార్సులను పంపేవారు. చిన్న పిల్లలు, గర్భిణులు, చెవి, ముక్కు, గొంతు, కళ్లు, కిడ్నీ, గుండె, ఎముకలు వంటి వివిధ రోగాలకు సంబంధించి కార్పొరేట్ ఆస్పత్రుల్లోనూ, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లోనూ పనిచేసే వైద్యులను జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు రప్పించి ప్రజలకు ఉచితంగా వైద్యసేవలు అందేలా చర్యలు చేపట్టారు. ప్రతీ శిబిరానికి సుమారు ఐదుమంది స్పెషలిస్టు వైద్యులతో పాటు స్థానిక ప్రభుత్వ వైద్యులు అందుబాటులో ఉండి సాయంత్రం వరకు వైద్య సేవలు అందించారు. గుండెకు సంబంధించిన ఈసీజీ కూడా శిబిరంలోనే తీసేవారు. పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసే వారు. దీనిలో భాగంగా నిపుణులైన వైద్యులు 14 రకాల జబ్బులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేసేవారు. అత్యవసర వైద్యసేవలు అవసరమైన వారిని సమీపంలోని ఆరోగ్యశ్రీ అమలవుతున్న వైద్యాలయానికి చికిత్స నిమిత్తం రిఫర్ చేసేవారు. దీంతో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేవి. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక వైద్య శిబిరాలను గాలికొదిలేయడంతో సూపర్ స్పెషాలిటీ వైద్యం ప్రజలకు దూర మైంది. దీంతో వైద్యం ప్రజలకు భారంగా మారింది.

పడకేసిన పల్లె వైద్యం- పేదలకు ఇబ్బందులు



ఇటీవల కురిసిన వర్షాల ప్రభావంతో వ్యాధులు ప్రబలుతున్నాయి. పట్టించుకునే వారు లేరు. ఐదు నెలలుగా ఉచిత వైద్య శిబిరాల ఊసేలేదు. గత ప్రభుత్వం ఐదేళ్లపాటు వైద్యానికి పెద్దపీట వేసింది. జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా పంచాయతీల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి స్పెషలిస్టు వైద్యులతో వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఉచిత నిర్ధారణ పరీక్షలతో పాటు కార్పొరేట్ వైద్యశాలల్లో మెరుగైన చికిత్సలు అందించి మందులు కూడా అందించారు. పేదలకు ఎంతగానో ఉపయోగపడ్డాయి.

–జాలాది యానాదిరావు, సర్పంచి, మామిళ్ల పల్లి

నేత్రాలపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



నేత్ర పరీక్షలు చేస్తున్న శంకర కంటి వైద్యులు

కొండపాటూరు(కాకుమాను): మానవ శరీరాల్లో అతి ముఖ్యమైనవి నేత్రాలని అలాంటి నేత్రాలపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని శంకర కంటి వైద్యశాల వైద్యులు చైతన్య అన్నారు. మండలంలోని కొండపాటూరులో ఆదివారం యార్లగడ్డ జయప్రద, రామయ్య చారిటీస్, జిల్లా అంధత్వశాఖ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ చైతన్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి కంటి చూపునివ్వాలనే ఉద్దేశంతో తన తల్లి దండ్రుల జ్ఞాపకార్థం గ్రామానికి చెందిన యార్లగడ్డ అంకమ్మ చౌదరి గత 25 సంవత్సరాల నుంచి గ్రామంలో ఉచిత నేత్ర వైద్యశిబిరాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రతి ఒక్కరూ నేత్రాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన సూచించారు. ఈసందర్భంగా 220 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా వారిలో 102 మందికి వివిధ రకాల నేత్ర సమస్యలు ఉన్నట్లు గుర్తించి వారిని శంకర కంటి ఆస్పత్రికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో చారిటీస్ చైర్మన్ యార్లగడ్డ అంకమ్మ చౌదరి, డాక్టర్లు రమణ, శ్రీనివాస్, సభ్యులు గన్నపనేని రాఘవరావు, చుండూరి శ్రీనివాస్, కాటూరి శ్రీనివాస్, అంకినీడు, మండవ లక్ష్మీనారాయణ, మల్లికార్జున్ పాల్గొన్నారు.

చలపతిలో ప్రారంభమైన దూర విద్య కేంద్రం

ద్యూయల్ డిగ్రీకి అవకాశం



దూరవిద్యా కోర్సుల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

గుంటూరు రూరల్: పోస్ట్ గ్రాడ్యుయేట్స్ సైన్స్ విభాగంలో 12 కోర్సులను 2024–25 విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించినట్లు చలపతి విద్యాసంస్థల అధినేత వై.ఆంజనేయులు తెలిపారు. ఆదివారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కోర్సుల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ చలపతి ఎడ్యుకేషన్ సొసైటీ, చలపతి డిగ్రీ కాలేజి కేంద్రంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం అనుబంధంతో దూరవిద్యలో పోస్ట్ గ్రాడ్యుయేట్స్ సైన్స్ విభాగంలో ఎంఎస్సీ(బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, మ్యాథమెటిక్స్, స్టాటిక్స్టిక్స్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్ సైన్స్, కంప్యూటర్ సైన్స్,సైకాలజి)తో పాటు ఎంబీఏ, ఎంసీఏ కోర్సులను ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించినట్లు తెలిపారు. అడ్మిషన్లు ప్రారంభించినట్లు చెప్పారు. ఏఎన్‌యూసీడీఈ.ఓఆర్‌జీ/డాష్ బోర్డ్/అలలిటిక్స్/ వెబ్ సైట్ ద్వారా అడ్మిషన్స్ పొందవచ్చని తెలిపారు. ఈ కోర్సులలో ప్రవేశం పొందిన విద్యార్థులు ప్రతి ఆదివారం చలపతి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో క్లాసులు జరుగుతాయన్నారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ(ఎన్ఈపీ)2020కు అనుగుణంగా ప్రతి విద్యార్థి ఫార్మసీ, ఇంజినీరింగ్‌తో పాటు అదనంగా ఒకటి లేదా రెండు డ్యూయల్ డిగ్రీ పొందే అవకాశం కల్పించడం జరిగిందని వివరించారు. కార్యక్రమంలో చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు పాల్గొన్నారు.

పొలానికి చీర సింగారం



చేను చీర కట్టింది. పచ్చని పంటలను కాపాడేందుకు రంగు రంగుల కోకలు చేనును చుట్టేశాయి. ప్రత్తిపాడు మండలం యనమదల సమీపంలో రైతులు రకరకాల కూరగాయల పంటలను సాగు చేశారు. రాత్రి సమయాల్లో అడవి పందుల దాడి నుంచి పైరును కాపాడుకునేందుకు ఇదిగో ఇలా చేను చుట్టూ రక్షణగా చీరెలు కట్టి పంటలను కాపాడుకుంటున్నారు. ఆ చిత్రాన్ని 'సాక్షి' తన కెమెరాలో బంధించింది.
–ప్రత్తిపాడు

ఎన్టీఆర్ స్టేడియం అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు



అధికారులకు, సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియం అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం బృందావన్ గార్డెన్స్ లోని ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియాన్ని స్థానిక వాకర్స్, నగరపాలక సంస్థ అధికారులతో కలసి పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ స్టేడియాన్ని క్రీడల హబ్‌గా, ఉదయం సాయంత్రం వాకింగ్ చేసుకునే వారికి ఆహ్లాదంగా, సమగ్ర మౌలిక వసతుల కేంద్రంగా తీర్చిదిద్దడానికి తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. టేబుల్ టెన్నిస్, షటిల్, వాలీబాల్, బ్యాడ్మింటన్ కోర్టులను, పురుషుల, మహిళల జిమ్‌లను పరిశీలించి, ప్రతి రోజు ఆయా క్రీడలకు ఎంత మంది వస్తున్నారు, స్టేడియం సభ్యుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా స్టేడియంలో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కొన్ని చోట్ల స్లాబ్ పెచ్చులు ఊడిందని, గోడలు బీటలు వచ్చాయని, వాటిని వెంటనే మరమ్మతులు చేయాలని చెప్పారు. జిమ్‌లో ఆధునాతన ఎక్విప్మెంట్ ఏర్పాటుకు, బ్యాడ్మింటన్ గ్రౌండ్‌లో లైట్లు, ఇతర అవసరమైన ఏర్పాట్లు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. పర్యటనలో ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, డెప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య, ఈఈ కోటేశ్వరరావు, డీఈఈ రమేష్, ఏఈ చైతన్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంగడి బాబు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

నెహ్రూనగర్: క్రీడల ద్వారా చిన్నారుల్లో మానసిక, శారీరక ధారుడ్యం పెంపొందుతుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో స్కేటింగ్‌లో శిక్షణ పొందిన శ్రీవల్లి, గౌతమ్ విశ్వాస్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా వారిని కమిషనర్ అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ క్రీడలు ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని, చిన్నారులను క్రీడలలో ప్రోత్సహించాలన్నారు. ఎన్టీఆర్ స్టేడియంలో క్రీడల శిక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. వివిధ క్రీడల కోర్టుల మరమ్మతులు చేపట్టి, నిపుణులైన శిక్షకులతో శిక్షణ అందిస్తామన్నారు.

ఘనంగా బాల కళా ప్రభ సాంస్కృతికోత్సవాలు ప్రారంభం

గుంటూరు ఎడ్యుకేషన్: బాలనంద కేంద్రం ఆధ్వర్యంలో రుద్ర కళాక్షేత్రం సహకారంతో చిన్నారుల్లో దాగి ఉన్న సాంస్కృతిక లలిత కళలను ప్రోత్సహిస్తూ నిర్వహిస్తున్న 'బాల కళా ప్రభ' సాంస్కృతికోత్సవం ఆదివారం కృష్ణనగర్ లోటస్ ఆద్య పాఠశాలలో ప్రారంభమైంది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన చిన్నారులతో పాఠశాల ప్రాంగణం కళకళలాడింది. మూడో తరగతి నుంచి టెన్త్ వరకు చదువుతున్న విద్యార్థులు చిత్ర లేఖనం, తెలుగు పద్యం, సంస్కృత శ్లోకం, జానపద, శాస్త్రీయ సంగీతం, నృత్యాలు, తెలుగులోనే మాట్లాడుకుందాం, జానపద దేశభక్తి గీతాల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈసందర్భంగా నటరాజ స్వామికి పూలమాలవేసి, జ్యోతి ప్రజ్వలన గావించిన అనంతరం కార్యక్రమాలను ప్రారంభించిన బాలానంద కేంద్రం అధ్యక్షుడు డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ దాదాపుగా ఏడు దశాబ్దాలుగా చిన్నారుల్లో దాగి ఉన్న అంతర్గత నైపుణ్యాలను వెలికి తీసేందుకు బాలానంద కేంద్రం కృషి చేస్తోందన్నారు. చదువుతో పాటు జీవన నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం, ఆత్మ నిర్బరం వంటి అనేక అంశాల్లో వారు మానసిక దారుఢ్యం గా ఎదిగేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి నడింపల్లి గురుదత్, సహాయ కార్యదర్శి బి.శ్రీనివాస్, కోశాధికారి జి.సంధ్యశ్రీ పాల్గొన్నారు.

పెదకాకాని శివాలయంలో కార్తిక శోభ

- భక్తులతో కళకళలాడిన కాకాని శివాలయం
- ఒక్కరోజులో స్వామివారి ఆదాయం రూ.6 లక్షలు
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన ఆలయ అధికారులు



పెదకాకాని శివాలయంలో పూజలందుకుంటున్న శ్రీమల్లేశ్వరస్వామి వారి మూలవిరాట్



పెదకాకాని శివాలయంలో కార్తిక దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న భక్తులు

పెదకాకాని: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పెదకాకాని శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం కార్తిక మాసం భక్తులతో కళకళలాడింది. ఆలయ ప్రాంగణం కార్తిక దీపాల కాంతుతో దేదీప్యమానంగా దర్శనమించింది. ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే ఆలయంలో భక్తుల సందడి ప్రారంభమైంది. ఆలయ ప్రాంగణంలోని యజ్ఞాల బావి నీటితో స్నానాలు చేసిన భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి దీపాలు వెలిగించి పూజలు చేశారు. ఆలయ ప్రాంగణం అంతటా ఓం నమఃశివాయ నామంతో మార్మోగింది. వివిధ సేవా కార్యక్రమాలు, ప్రసాద విక్రయాల ద్వారా స్వామికి రూ.6,00,000 ఆదాయం సమకూరినట్లు ఆలయ డెప్యూటీ కమిషనర్ కేవీ శ్రీనివాసరావు తెలిపారు.



పెదకాకానిలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు





పెదకాకాని శివాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తుల సందడి

పేకాట స్థావరంపై దాడి

38 మంది అరెస్టు, రూ.96 వేలు స్వాధీనం

ప్రత్తిపాడు: గుట్టుచప్పుడు కాకుండా రహస్యంగా పేకాటాడుతున్న జూద స్థావరంపై ప్రత్తిపాడు పోలీసులు మెరుపుదాడి చేసిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. మండల పరిధిలోని జాతీయ రహదారిపై ఓ ప్రైవేటు కళాశాలకు వెళ్లే దారిలో ఉన్న షెడ్డులో పెద్ద ఎత్తున జూదమాడుతున్న సమాచారం ఆదివారం సాయంత్రం ప్రత్తిపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గన్నవరపు శ్రీనివాసరావుకు అందింది. దీంతో ఆయన సిబ్బందితో కలసి స్థావరంపై దాడి చేశారు. 38 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ. 96,300 స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బొప్పన ఆత్మీయ పురస్కారాలు ప్రదానం

నగరంపాలెం: గుమ్మడి శ్రీమన్నారాయణ కళాసమితి, వైకే నాగేశ్వరరావు కళాపరిషత్ సంయుక్తంగా కొరిటెపాడు ఎల్‌వీఆర్ క్లబ్‌లో నిర్వహిస్తోన్న నాటకోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. కాట్రగడ్డ రామకృష్ణ, బొప్పన నరసింహారావు ఆధ్వర్యంలో బొప్పన ఆత్మీయ పురస్కార సభ నిర్వహించారు. ఎల్‌వీఆర్ క్లబ్ అధ్యక్షులు మైనేని బ్రహ్మేస్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి అధ్యక్షత వహించారు. అనంతరం బొప్పన నరసింహారావు ఆత్మీయ పురస్కారాలను ప్రముఖ రంగస్థల నటులు చలసాని కృష్ణప్రసాద్(విశాఖపట్నం), ఎస్ఎం బాషా(నరసరావుపేట), రంగస్థల నటులు దేవిరెడ్డి రామకోటేశ్వరరావులకు అందజేసి సత్కరించారు. అనంతరం మైత్రి కళా నిలయం(విజయవాడ) మాడుగుల రామకృష్ణ రచనలో టీవీ పురుషోత్తం దర్శకత్వం వహించిన బంధం సాంఘిక నాటిక సందేశాత్మకంగా కొనసాగింది. బత్తినేని సుభాష్ రచన దర్శకత్వంలో ఓరి వీళ్ల నటన పాడుగాను ఆడిషన్స్ స్కిట్ ప్రదర్శన అలరించింది. కార్యక్రమంలో డి.తిరుమలేశ్వరరావు, జి.మల్లికార్జునరావు, జానీబాషాలు పాల్గొనగా, అతిథులను కళాకారులను సత్కరించారు.

విజ్ఞాన్ ఉపాధ్యాయుల అ'పూర్వ' కలయిక



సమ్మేళనానికి హాజరైన ఉపాధ్యాయులతో చైర్మన్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ శ్రీకృష్ణదేవరాయలు

చేబ్రోలు: మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ పూర్వ ఉపాధ్యాయుల సందడికి వేదికయ్యింది. విజ్ఞాన్ హైస్కూల్‌లో పనిచేసిన పూర్వ ఉపాధ్యాయులందరూ తమ కుటుంబ సభ్యులతో ఆదివారం విజ్ఞాన్ యూనివర్సిటీలో కలిశారు. నాలుగు దశాబ్దాల అనంతరం కలిసిన వారంతా సందడిగా, సరదాగా, హుషారుగా గడిపారు. కార్యక్రమానికి హాజరైన విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ విజ్ఞాన్ విద్యాసంస్థలు ఈరోజు ఇంత ఉన్నత స్థాయికి ఎదిగి అభివృద్ధి పథంలో నడవడానికి కృషి చేసిన మీరందరూ వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ఈ రోజు ఇక్కడ పూర్వ ఉపాధ్యాయుల సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ నాకు స్కూల్‌లో పాఠాలు బోధించిన మిమ్మల్ని ఇక్కడ కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులు, చదువు నేర్పిన గురువులను ఎప్పటికీ గౌరవిస్తూనే ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో పురపాలక టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.రామకృష్ణ, సెంట్రల్ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ అడిషనల్ కమిషనర్ వీరభద్రరావు, డీన్ ఏ శారద, కేఎస్ రామారావు, నారాయణ, ప్రసాదరావు, పాపకుమారి, నిర్మల, భాగ్యలక్ష్మి, సరళాదేవి పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ సీసీ కెమెరాల డేటా చోరీపై కేసు

లక్ష్మీపురం: నగరంలోని అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో సీసీ కెమెరాల డేటాను చోరీ చేసి ఓ విలేకరికి ఇవ్వడంతో సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఘటనలో స్టేషన్ ఎస్ఐ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం అర్ధరాత్రి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. గుంటూరు నగరంలోని పోలీస్ స్టేషన్లు, ఎస్పీ కార్యాలయంలో సీసీ కెమెరాలు, ఇంటర్‌నెట్ కనెక్షన్లు సర్వీస్ అరండల్‌పేటకు చెందిన శేషు అందిస్తుంటాడు. అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో సీసీ కెమెరాల డేటాను చోరీ చేశాడు. ఆ డేటాలో ఇటీవల బోరుగడ్డ అనిల్ కేసులో రాజమండ్రి నుంచి మూడు రోజుల పోలీస్ కస్టడీకి స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఆ సమయంలో బోరుగడ్డ అనిల్ పోలీస్ స్టేషన్‌లో బల్లపై దుప్పట్లు వేసుకుని విశ్రాంతి తీసుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్న సమయంలో స్టేషన్ ఎస్‌హెచ్ఓ కె.శ్రీనివాసరావు అక్కడే ఉండటం, ఉన్న డేటా ఓ పత్రికలో విలేకరిగా పని చేసే వ్యక్తికి శేషు ఇచ్చాడు. దాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో రెండు రోజులుగా బోరుగడ్డ అనిల్‌కు రాచమర్యాదలు చేస్తున్న అరండల్‌పేట పోలీసులు అనే కథనాలు వచ్చాయి. దీంతో రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి శనివారం రాత్రి అరండల్‌పేట సీఐ శ్రీనివాసరావును వీఆర్‌కు పిలిచారు. ఇదిలా ఉంటే డేటా చోరీ చేసిన విషయంపై అరండల్‌పేట ఎస్ఐ రోజాలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీసీ కెమెరాల టెక్నీషియన్ శేషు, ఓ దినపత్రికలో విలేకరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొత్తపేట పరిధిలో పోలీసుల వారధి కార్యక్రమం



పట్నంబజారు: గుంటూరు ఈస్ట్ సబ్ డివిజన్ కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటాద్రిపేటలో ఆదివారం వారధి కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ ఎం.వీరయ్య ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. పూర్తిస్థాయిలో స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మద్యం బాబులు, గంజాయి మత్తులో కొంత మంది ఆగడాలు పాల్పడుతున్నారని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై మరింత భద్రత పెంచుతామని ఎస్‌హెచ్ఓ వీరయ్య హామీ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ సైబర్ నేరాలకు బలికాకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎటువంటి సమస్య వచ్చిన నేరుగా కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.